క్లుప్తంగా

బురాన్‌దొడ్డిలో నేడు ఉరుసు



ఉరుసుకు సిద్ధమైన గోకారమయ్య దర్గా

సి.బెళగల్: మండల పరిధిలోని బురాన్‌దొడ్డి గ్రామంలో సోమవారం గోకారమయ్య ఉరుసు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు, నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా దర్గాను సుందరంగా అలంకరించారు. మంగళవారం రాత్రి గంధం కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లను పూర్తి చేశారు. స్వామి వారి గంధంను ఆదివారం అర్ధరాత్రి అనంతరం గ్రామంలోని కేవీ కిరణ్‌కుమార్ ఇంటి నుంచి భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా తీసుకెళ్లి, సోమవారం వేకువజామున గోకారమయ్య దర్గాకు చేరుకుంటారని నిర్వాహకులు తెలియజేశారు.

యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు



వాగులో జేసీబీతో తవ్వకాలు సాగిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ గ్రామం వద్ద వాగులో జేసీబీల సాయంతో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. ఈ మట్టిని ఇతర వ్యాపార సముదాయాలకు తరలిస్తుడటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారి పార్టీకి చెందిన నాయకులు ఇష్టానుసారంగా, అధికారుల అనుమతి లేకుండా వాగులో జేసీబీలతో మట్టిని తవ్వుతున్నారు. ప్రజలు ప్రశ్నిస్తే అధికారుల అనుమతి తీసుకొని తవ్వుతున్నట్లు బుకాయించారు. ఈ విషయంపై మైనర్ ఇరిగేషన్ డీఈఈ నాగన్నను వివరణ కోరగా.. మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతి తీసుకోలేదని తణమే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



కొరటమద్దిలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

గడివేముల: మండల పరిధిలోని కొరటమద్ది గ్రామంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వెయ్యి మందికి పైగా ప్రజలు ఈ శిబిరంలో వైద్య సేవలు పొందారు. విద్యాదాన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో శాంతిరాం జనరల్ హాస్పిటల్, కాలేజీ వారిచే ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. అలాగే షుగర్, ఈసీజీ, ఎముకల సాంద్రత పరీక్షలు చేశారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ వి.వి.శివరామిరెడ్డి, న్యూరో సర్జన్ డాక్టర్ పాండురంగారావు, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ రాజ్ కుమార్, పల్మనాలజిస్ట్, పురిటి, చిన్నపిల్లల డాక్టర్ నవనీత్ బృందం, కంటి డాక్టర్ మౌనిక హాజరై రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామ పెద్దలు డి.అయ్యప్ప రెడ్డి, సుకుమార్ ఆచారి, జనార్దన్ రెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు మనోహర్, విద్యాదాన్ సొసైటీ నిర్వాహకులు డి.బి.వెంకటేశ్వర్లు, సత్యం పాల్గొన్నారు.

ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే చర్యలు

కర్నూలు (టౌన్): ఈవ్ టీజింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఆదివారం ఈవ్ టీజింగ్‌పై యువకులకు హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా నగరంలోని ఆయా పోలీసు స్టేషన్లకు చెందిన సీఐలు మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ఆయా పాఠశాలలు, కళాశాలల వద్ద యాంటీ ఈవ్ టీజింగ్ బీట్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఈవ్ టీజింగ్, అకతాయిల వల్ల ఏవైన ఇబ్బందులు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇప్పటివరకు ఈవ్ టీజింగ్ పాల్పడే వారిని గుర్తించి పోలీసు స్టేషన్‌లకు పిలిపించి హెచ్చరించామన్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా పెట్టినట్లు చెప్పారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

కర్నూలు(అగ్రికల్చర్): ఈ నెల 5న బళ్లారి చౌరస్తా నుంచి కోడుమూరు వెళ్లే రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్న కాటిపోగు శేఖర్ (37) కోలుకోలేక ఆదివారం మరణించారు. నంద్యాల జిల్లా, మిడుతూరు మండలం, ఆలగనూరు గ్రామానికి చెందిన కాటిపోగు శేఖర్ స్కూటీపై అత్తగారి గ్రామమైన పెద్దపాడు వెలుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. క్షతగాత్రుడిని 4వ పట్టణ పోలీసులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మరణించారు. మృతుడికి ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. 4వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

ఇదేమి పారి'చోద్యం'?

- రోడ్లపైనే ప్రవహిస్తున్న మురుగు నీరు
- విజృంభిస్తున్న దోమలు
- రోగాల బారిన పడుతున్న గ్రామస్తులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు

కర్నూలు(రూరల్): ఏ గ్రామం చూసినా పక్కా డ్రైయినేజీలు లేక రోడ్లపైనే ప్రవహిస్తున్న మురుగునీరు. మురుగు నీటిపై ఆవాసాలు ఏర్పరచుకున్న దోమల దృశ్యాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తూ కూటమి ప్రభుత్వ పాలనకు అద్దం పడుతున్నాయి.

అధికారులు గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించకపోయినా క్రమం తప్పకుండా ఇంటి, కుళాయి పన్నులు వసూలు చేస్తున్నారని, ఎన్నికల సమయంలో స్థానిక నాయకులు వచ్చి సమస్యలు పరిష్కరిస్తాం అంటూ వాగ్దానాలు చేయడం, ఎన్నికల తర్వాత సమస్యను పరిష్కరించమని వేడుకున్నా కనీసం కన్నెత్తి కూడా చూడడం లేదని గ్రామాల్లోని ప్రజలు వాపోతున్నారు. దోమలతో వేగలేక చీకటి పడగానే కిటికీలు, తలుపులు మూసుకుంటున్నారు. అయినప్పటికీ దోమల బెడదతో పిల్లలు, వృద్ధులు జర్వాల బారిన పడుతున్నారని మహిళలు వాపోతున్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. మురుగు నీరు రోడ్లపైనే పారుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతన్నారు. కర్నూలు మండలంలో 23 గ్రామపంచాతీలు, 9 మజారా గ్రామాలతో కలిపి మొత్తం 32 గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లోని డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్త చెదారం తొలగింపుపై అధికారులు ఏమాత్రం దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో మురుగు, చెత్త, దోమలు, ఈగలు, లార్వాల సంతతికి నెలవుగా మారింది. కొన్ని గ్రామాల్లో వీధుల్లో ఎక్కడి చెత్త అక్కడే ఉంటోంది. దీంతో స్థానిక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లోని డ్రైనేజీలు చెత్త చెదారంతో నిండిపోయి పూడిక పేరుకుపోవడంతో మురుగు నీరు రోడ్లపైకి వస్తోంది. రోడ్లపై గుంతల్లో నిల్వ ఏర్పడి భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. పారిశుద్ధ్య లోపంతో దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. మండలంలోని దిగువపాడు, తులాశాపురం, పడిదెంపాడు, పంచలింగాల, ఇ.తాండ్రపాడు, జి.సింగవరం, ఆర్.కొంతలపాడు, సుంకేసుల, దిన్నెదెవరపాడు, రేమట, దేవమాడ, శివరామాపురం, పూడూరు తదితర గ్రామాల్లో పారిశుద్ధ్య లోపంతో అధ్వానంగా తయారయ్యాయి. సైడు కాలువలు లేకపోవడంతో ఇళ్లలోనుంచి వచ్చే మురుగు నీరంతా రోడ్డుపైకి చేరుతుంది. మురుగు, చెత్త, దోమల సంతతి తి నెలవుగా మారింది. దీంతో ఆ గ్రామాల్లోని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



దిగువపాడు ప్రాథమిక పాఠశాల వద్ద రోడ్డుపై నిలిచిన మురుగునీరు



ప్రధాన రహదారిలో లోపించిన పారిశుద్ధ్యం



ఇ.తాండ్రపాడు ఇందిరమ్మ కాలనీలో రోడ్డుపై పారుతున్న మురుగు



దిగువపాడు గ్రామ శివాలయం సమీపంలో రోడ్డుపై పారుతున్న మురుగు

దోమల బెడద భరించలేకున్నాం



మాలపేటలో 150 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. డ్రైనేజీలు లేక కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు. మురుగునీరంతా ఇళ్ల ముందు నిలిచి దోమల వ్యాప్తికి కారణం అవుతోంది. రాత్రయితే దోమల బెడద భరించలేకున్నాం. అధికారులు చర్యలు తీసుకొని డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి. – పి.శివమ్మ, ఎస్సీ కాలనీ, గార్గేయపురం గ్రామం

రోడ్డుపైనే మురుగునీరు



మా గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. డ్రైనేజీలు లేక మురుగునీరు రోడ్డుపై పారుతోంది. దీంతో దోమలు వ్యాప్తి చెంది, ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఎస్సీ కాలనీలో డ్రైనేజీ అస్తవ్యస్థంగా తయరైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాలను పట్టించుకోవడం లేదు.
– ఎమ్.కృష్ణవేణి, ఎంపీటీసీ, దిగువపాడు గ్రామం,

డ్రైనేజీలు నిర్మించాలి



గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో డ్రైనేజీ లేక మురుగు నీరు ఇళ్ల ముందే నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో కాలనీ వాసులు బయటకు వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మురుగు వల్ల దోమలు, విషకీటకాల బారినపడి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. సమస్యను విన్నవించినా పంచాయితీ అధికారులు పటించుకోవడం లేదు. ఇందిరమ్మ కాలనీలో తక్షణమే డ్రైజేజీ నిర్మాణం చేపటాలి. – ఎం.రత్నమ్మ, ఇందిరమ్మ కాలనీ, ఇ.తాండ్రపాడు గ్రామం

బాధ్యతాయుతంగా పని చేయండి



కాటసాని దంపతులను సత్కరిస్తున్న నేతలు

కల్లూరు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర, జిల్లా, నియోజక వర్గం, మండలాల విభాగాల్లో పదవులు పొందిన వారంతా బాధ్యతయుతంగా, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలిగా నియమితులైన కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి ఆదివారం కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఉమామహేశ్వరమ్మ దంపతులను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వారికి పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. పార్టీలో పదవులు పొందిన వారంతా అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. నాయకులు హనుమంతురెడ్డి, రమణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, గంగులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పాటుపడాలి



మాట్లాడుతున్న ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ

కర్నూలు(రూరల్): కర్నూలు మండల ప్రజాపరిషత్ సమావేశ భవనంలో ఆదివారం ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన, పరిపాలన అధికారి జీ.వి.చంద్ర శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాధికారులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. బి.తాండ్రపాడులో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీ కురువ మద్దిలేటి ఆర్‌డబ్ల్యూఎస్ మండల అధికారి రంగస్వామి దృష్టికి తెచ్చారు. ఇ.తాండ్రపాడులో 11 కేవీ వైర్లు ఇందిరమ్మ కాలనీ మిద్దెల మీదుగా వెళ్లడం వల్ల కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని, సర్పంచ్ బాలపీర సమస్యను మండల విద్యుత్ అధికారి దృష్టికి తెచ్చారు. రేమటలో విద్యుత్ స్తంభాలు ఇళ్లకు దగ్గరగా ఉన్నాయని ఆ ఎంపీటీసీ లేవనెత్తారు. సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఎంపీపీ సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. వివిధ శాఖల మండల అధికారులు, వైస్ ఎంపీపీ నెహమ్యా, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొనారు.

గెలుపు సంబరాలు





రాజ్‌విహార్ సర్కిల్‌లో సంబరాలు చేసుకుంటున్న యువకులు

కర్నూలు అగ్రికల్చర్: ఐసీసీ చాంపియన్‌షిప్‌ట్రోఫీని భారత జట్టు గెలుపొందడంతో కర్నూలులో సంబరాలు వెల్లువెత్తాయి. దుబాయ్‌లో జరిగిన చాంపియన్‌షిప్ ఫైనల్‌లో భారత జట్టు నాలుగు వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌పై ఘన విజయం సాధించింది. దీంతో సంబరాలు మిన్నంటాయి. కర్నూలులో వందలాది మంది యువకులు జాతీయ పతాకాలు చేతబట్టి బైక్ ర్యాలీలు నిర్వహించారు. రాజ్‌విహార్ సెంటర్‌లో యువత బాణాసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు.

పారిశుద్ధ్యంపై ఫిర్యాదులు రానివ్వొద్దు

కర్నూలు (టౌన్): పారిశుద్ధ్యంపై ఫిర్యాదులు రాకుండా కార్మికులు పనిచేయాలని, అదే స్థాయిలో సచివాలయాల సిబ్బంది, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షణ చేయాలని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు స్పష్టం చేశారు. ఆదివారం కమిషనర్ ధర్మపేట, స్టేడియం రహదారి, రాజ్‌విహార్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చేంత వరకు వేచిఉండకుండా ఎప్పటికప్పుడు చెత్త చెదారం తొలగించాలన్నారు. రెండు వారాలకు ఒకసారి తప్ప నిసరిగా పూడికతీత పనులు చేపట్టాలన్నారు. కాలనీలలో ప్రతి ఇంటి వద్ద మురుగు కాల్వలను శుభ్రం చేయాలన్నారు. అపరిశుభ్రత కనిపిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా ఉరుసు



గంధంను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

సి.బెళగల్: మండల పరిధిలోని పలుకుదొడ్డి గ్రామంలో బడేఖాన్ ఖాద్రి ఉరుసు ఉత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఆదివారం తెల్లవారుజామున గంధం కార్యక్రమాన్ని భక్తులు సంబరంగా మొదలు పెట్టారు. గంధను ఊరేగింపుగా గ్రామ చివర చెరువుగట్టున వెలసిన బడేఖాన్ ఖాద్రి దర్గా దగ్గరకు చేర్చినట్లు పీఠాధిపతి మసూద్ బాషా తెలిపారు. గ్రామస్తులే గాక ఇతర ప్రాంతాల ప్రజలు, భక్తులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. సోమవారం కిస్తీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు, నిర్వాహకులు తెలిపారు.

భక్తుల కొంగుబంగారం లక్ష్మీమాధవస్వామి

- 12 నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు
- భారీగా తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు చేసిన అధికారులు

కోడుమూరు రూరల్: మండలంలోని గోరంట్ల గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ మాధవస్వామి కొలిచేవారికి కొంగుబంగారంగా విరాజిల్లుతున్నారు. జిల్లాలో ప్రసిద్ధిగాంచిన జాతరలో ఒకటైన లక్ష్మీమాధవస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 12వ తేదీ నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 12వ తేదీన అంకురార్పణ, రక్షాబంధనం, 13న ధ్వజారోహణం, రాత్రి బేరిపూజ, సింహోత్సవం, 14న శేషోత్సవం, 15న హనుమంతోత్సవం, 16న శ్రీవారి కల్యాణోత్సవం, గరుడోత్సవం, 17న గజతోత్సవం, 18న శిఖికోత్సవం, 19న రథారోహణం, 20న శ్రీవారి రథోత్సవం, 21న పారువేట, 22న హంసవాహనం, వసంతోత్సవం, శ్రీచక్రస్నానం, రాత్రికి కంకణ విసర్జన కార్యక్రమాలను నిర్వహించేందుకు దేవదాయ శాఖాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



లక్ష్మీమాధవస్వామి మూలవిరాట్

ఆలయ చరిత్ర

చోళుల కాలం నాటికే ప్రాశస్త్యాన్ని సంతరించుకున్న గోరంట్ల మాధవాలయానికి దాదాపు వెయ్యి సంవత్సరాల చరిత్ర ఉంది. చోళ (క్రీ.శ 1105), యాదవ (క్రీ.శ 1210), అరవీటి (క్రీ.శ 1628) రాజుల శిలా శాసనాలు ఇక్కడ లభించాయి. శిలా శాసనాలపై 1937–38 సంవత్సరాల్లో బ్రిటీష్ ప్రభుత్వం సర్వే జరిపించి స్వామికి సంబంధించిన తామ్ర శాసనాలను మద్రాసుకు చేర్చింది. మద్రాసు ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో స్వామికి సంబంధించిన మాధవ శతకం, మాధవాష్టకం తాటాకు గ్రంథాల్లో లభిస్తాయి. పూర్వకాలంలో గోరువంక మహాముని ఈ పరిసర ప్రాంతంలో నివసించారని, ఆయన పేరిట గోరంట్ల అనే పేరు వచ్చిందని నానుడి. మూడు దశాబ్దాల క్రితం దేవదాయ శాఖ వారు ఆలయాన్ని స్వాధీన పరచుకుని పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. స్వామి ఆలయానికి 704.54 ఎకరాల భూమి ఉంది.



ఆలయ గోపురం

ప్రత్యేకతగా శ్రీవారి కల్యాణం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగే గరుఢోత్సవం రోజున శ్రీవారి కల్యాణాన్ని వేదపండితులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. స్వామి అమ్మవార్ల కల్యాణాన్ని పురస్కరించుకొని నిరుపేద జంటలు వివాహం చేసుకోవడం ఇక్కడి విశేషం.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: మండలంలోని దివ్యాంగుల ఉపయోగార్థం నిర్వహించే ఫిజియోథెరపి క్యాంప్‌ను దివ్యాంగులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జ్యోతి ఆదివారం ప్రకటనలో సూచించారు. స్థానిక మండల భవిత కేంద్రంలో ప్రతి సోమవారం దివ్యాంగులకు శారీరక అవయవాలకు వైద్యుడు వీరేష్‌చే ఫిజియోథెరపీ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు తమ కుటుంబ సభ్యులలోని దివ్యాంగులను భవిత కేంద్రానికి తీసుకొచ్చి, ఫిజియోథెరపీ చేయించాలని సూచించారు.

పీజీఆర్ఎస్‌కు అధికారులందరూ హాజరవ్వాలి

సి.బెళగల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులందరూ తప్పనిసరిగా హాజరవ్వాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం మండలంలోని అన్ని శాఖల అధికారులతో కలిసి పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, మండల అధికారులందరూ తప్పక హాజరుకావాలన్నారు. హాజరుకాని అధికారులపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు. మండల ప్రజలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని, తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

బోయలను ఎస్టీలుగా గుర్తించాలి

పాణ్యం: వాల్మీకి బోయలను ఎస్టీలుగా గుర్తించాలని రాష్ట్ర వాల్మీకి బోయ న్యాయవాదుల జేఏసీ కో–కన్వీనర్ రామోహన్‌నాయుడు డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.. వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలనే డిమాండ్‌తో గత కొన్నేళ్లుగా పోరాడుతున్నట్లు తెలిపారు. దీనిపై కేంద్రంలో బిల్లు ప్రవేశపెట్టాలని కోరారు. 1956లో ఎస్టీలుగా ఉన్న వాల్మీకులను విముక్తి జాతులు పేరిట బీసీలుగా మార్చారన్నారు. వాల్మీకి బోయలు అన్ని రంగాల్లో వెనకబడ్డారని, వారి స్థితిగతులపై పునరాలోచించి ఎస్టీ జాబితాలోకి చేర్చాలని కోరారు. తమ డిమాండ్‌పై ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవాలని కమిషన్‌ల పేరిట ఆలస్యం చేయరాదన్నారు.

నేడు 'సంపూర్ణ భగవద్గీత' పారాయణం

కర్నూలు కల్చరల్: స్వామి విద్యా ప్రకాశానంద గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో ఏకాదశి పురస్కరించుకొని సోమవారం ×సంపూర్ణ భగవద్గీత₹ పారాయణం నిర్వహించనున్నట్లు గీతా ప్రచార సంఘం అధ్యక్షుడు డీవీ రమణ తెలిపారు. సంకల్‌బాగ్‌లోని గీతా ప్రచార ధామంలో ఉదయం 9.30 గంటలకు పారాయణ యజ్ఞం జరుగుతుందన్నారు. ధార్మిక సంస్థల ప్రతినిధులు, సభ్యులు, భక్తులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

హిందూ సంఘాల ఆందోళన



గూడూరులో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న హిందూ సంఘాల నాయకులు

కోడుమూరు రూరల్: అన్నమయ్య జిల్లా రాయచోటిలో వీరభద్ర స్వామి పారువేట ఉరేగింపును ముస్లింలు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ ఆదివారం గూడూరులో హిందూ పరివార సంఘాల నాయకులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామ వికాస సమితి ప్రముఖ్ డమాం సురేష్ మాట్లాడుతూ.. సంప్రదాయబద్ధంగా వెళుతున్న వీరభద్ర స్వామి ఉత్సవాన్ని కొందరు ముస్లింలు అడ్డుకోవడం దారుణమన్నారు. వారికి వత్తాసు పలుకుతూ ఎస్ఐ హిందువులపై కేసులు పెట్టడం సబబు కాదన్నారు. ఉత్సవాన్ని అడ్డుకున్న వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు, హిందువులపై తప్పుడు కేసులు పెట్టిన ఎస్ఐను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కోడుమూరు సీఐ తబ్రేజ్‌కు అందజేశారు. భజరంగ్ దళ్ జిల్లా కన్వీనర్ రాజేష్, హిందూ పరివార సంఘాల నాయకులు కిరణ్, నటరాజ్, హరి, మధు, ఆనంద్, భీమేష్, బలరాం, శివరాముడు, బిజేపీ గూడూరు మండల అధ్యక్షుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేత ఎన్.కొంతలపాడు



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

ఓర్వకల్లు: మండలంలోని ఎన్.కొంతలపాడు గ్రామంలో రెండు రోజుల క్రితం నిర్వహించిన అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. గ్రామంలోని అంబాసహిత, యాగంటీశ్వర స్వామి తిరుణాల సందర్భంగా నిర్వహించిన పోటీలలో వివిధ రాష్ట్రాలకు చెందిన 40 జట్లు పాల్గొన్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. రెండు రోజుల పాటు జరిగిన పోటీలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ పోటీలలో ఎన్.కొంతలపాడు జట్టు విజేతగా నిలిచి రూ.25 వేలను గెలుచుకుంది. తరువాతి స్థానాల్లో నిలిచిన ఎమ్మిగనూరు తాలుకా, గోనెగండ్ల జట్టు రూ.20 వేలు, తెలంగాణ రాష్ట్రం, పచ్చర్ల జట్టు రూ.15 వేలు, వారణాసి (కర్ణాటక) జట్టు రూ.10 వేలు, శకునాల జట్టు రూ.6 వేలు, కాల్వబుగ్గ హంటర్స్ జట్టు రూ.5 వేలు దక్కించుకున్నాయి. ఈ పోటీలకు చాకలి యాగంటయ్య, మంద విజయ్, మంద నరేష్, చాకలి స్వాములు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలైన జట్లకు సాయంత్రం ఉత్సవ కమిటీ సభ్యులు బహుమతులను ప్రదానం చేశారు.

పుష్పరథంపై చెన్న సోమేశ్వరుడు



పోలకల్‌లో పుష్పరథంపై చెన్నసోమేశ్వరుడిని ఊరేగిస్తున్న భక్తులు

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో చెన్నసోమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మొదటి రోజు శనివారం అర్ధరాత్రి పుష్పరథోత్సవం వైభవంగా ప్రారంభమైంది. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజామున గంగాదేవి, పార్వతీదేవి సమేత చెన్నసోమేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పుష్పరథంపై మేళతాలాలతో ప్రధాన వీధిలో ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.